ముందే స్పందిస్తే.. ప్రమాదాలు జరగవు!


హనుమాన్ నగర్‌లో జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో ఎగిసిపడిన మంటలు

- కూకట్‌పల్లి డివిజన్‌లో విద్యుత్ స్తంభాలకు మంటలు
- నిప్పురవ్వలు చెలరేగడంతో ఒక్కసారిగా ఎగిసిపడిన మంటలు
- మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది.. ఊపిరిపీల్చుకున్న స్థానికులు
- స్తంభం నుంచి నిప్పురవ్వలు వస్తున్నాయని గతంలో ఫిర్యాదులు
- అయినా పట్టించుకోని అధికారులు, కిందిస్థాయి సిబ్బంది



రక్షణ పరికరాలు లేకుండా విద్యుత్ మరమ్మతులు చేస్తున్న కార్మికులు



ఆల్విన్‌కాలనీ: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగింది. హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు షార్ట్ సర్క్యూట్ జరిగి ఆదివారం అర్ధరాత్రి వేళలో దట్టమైన పొగతో కూడిన మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా నిద్రపోతున్న స్థానికులు ఉలిక్కి పడ్డారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ హనుమాన్‌నగర్ నల్లపోచమ్మ దేవాలయం సమీపంలోని ఓ స్తంభంపై 33/11 కేవీ హైటెన్షన్ వైరు వెళ్లటంతో ప్రతి రోజు చి చిన్న నిప్పు రవ్వలులాగా మంటలు చెలరేగుతుండేవి. విషయాన్ని స్థానికులు పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఫలితం ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి.

మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

◆ భయభ్రాంతులకు గురైన స్థానికులు అర్ధ రాత్రి విద్యుత్ అధికారులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్‌ఇంజన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పెద్ద ప్రమాదం జరిగినా స్థానికంగా ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఫిర్యాదు చేసినప్పుడే పట్టించుకుంటే ఇలాంటి ప్రమాదాలు 90శాతం వరకు జరగవని స్థానికులు చెబుతున్నారు. రాత్రంతా విద్యుత్ సరఫరా నిలచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు.

◆ గతంలో పాపిరెడ్డినగర్‌లో ఓ ఇంటి ముందు వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ సెంట్రింగ్ కట్టెలకు ఆనుకొని ఉంది. ఆ విషయం భవన నిర్మాణ కార్మికుడికి తెలియకపోవడంతో అతడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

◆ కేపీహెచ్‌బీ చౌరస్తాలో గతేడాది షార్ట్ సర్క్యూట్ జరిగి వ్యాపార సముదాయాల్లోని విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. దీంతో లక్షలాది రూపాయలు ఆస్తి నష్టం సంభవించింది.

◆ ఆల్విన్‌కాలనీ ఫేజ్–1 ప్రధాన రహదారిలో ఓ ఇంటికి ఆనుకొని వెళ్తున్న హైటెన్షన్ వైర్ల కారణంగా షార్టు సర్క్యూట్ జరిగింది. దీంతో భవన నిర్మాణ కార్మికుడికి షాక్ తగలడంతో పాటు ఆ ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి.

◆ విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడకపోవటం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక సంక్షేమ సంఘాలు పేర్కొంటున్నాయి.

◆ సోమవారం విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్నప్పుడు కూడా అధికారులు ఆ ప్రాంతంలో లేరు. అంతేకాక విద్యుత్ వైర్లు అమర్చే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించటంలో కూడా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు.

◆ హెల్మెట్, చేతి గ్లౌజులు, షూస్ వంటి రక్షణ పరికరాలు లేకుండానే సిబ్బంది మరమ్మతు పనులు చేపడుతున్నారు.

సమ్మర్ క్యాంపుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

మూసాపేట డీసీ రమేష్



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజులోని సమ్మర్ క్యాంప్‌ను సోమవారం మూసాపేట డీసీ రమేష్ సందర్శించారు. అక్కడ ఫుట్‌బాల్ ఆడుతున్న చిన్నారులను పలకరించి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో విద్యార్థులలకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వివిధ ఆటల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. అందులో భాగంగానే గ్రౌండ్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. బాస్కెట్ బాల్ బోర్డులను మార్చటం, ఫ్లోరింగ్ పగుళ్లకు ప్యాచ్ వర్క్, ఫ్లడ్ లైట్ల ఏర్పాటు, మంచినీరు, బాత్‌రూమ్ వంటి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు పలు రకాల ఆటల్లో తర్ఫీదు పొంది మంచి పేరు తీసుకురావాలని సూచించారు.


కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో చిన్నారులతో ముచ్చటిస్తున్న డీసీ రమేష్

నాగలింగేశ్వరస్వామికి ఎమ్మెల్యే పూజలు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: దత్తాత్రేయకాలనీలోని నాగలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో బీఆర్ఎస్ నాయకులు కాశీనాథ్ యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, నాగభూషణం, జగదీష్, కటిక రవి, సత్యనారాయణ, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

'బీవీ లక్ష్మి ఓర్పు, సహనంతో ఆర్టీసీ మర్యాదను పెంచారు'

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ బీవీ లక్ష్మి పట్ల ప్రయాణికులు అమర్యాదగా ప్రవర్తించారు. అయినా విధి నిర్వహణలో ఆమె ఓర్పు, సహనంతో దానిని స్వీకరించి సంస్థ మర్యాదను పెంచింది. దీంతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు సోమవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యకరమంలో ఆర్‌ఎం ఆలీఖాన్, డిప్యూటీ ఆర్‌ఎం కవిత, డిపో మేనేజర్ ఇషాక్ బిన్‌మమహ్మద్‌లు పాల్గొని ఆమెను అభినందించారు.

ఫీజుల నియంత్రణ కమిటీని పునరుద్ధరించాలి

లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

మోతీనగర్: నానాటికి పడిపోతున్న విద్యా ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు అధికంగా వసూలు చేయటంతో తల్లిదండ్రులకు భారం అవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ కమిటీని పునరుద్ధరించాలన్నారు. కొత్తగా రాష్ట్రంలో 203 గ్రామ పంచాయితీల్లో ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించుకోవటం శుభ పరిణామమని అన్నారు. ఖాళీలుగా ఉన్న మండల విద్యాధికారులను, బోధన, బోధనేతర సిబ్బందిని స్కూళ్ల ప్రారంభానికి ముందే నియమించాలని కోరారు. అంతే కాకుండా విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మెట్ల జగన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస వర్మ, కార్యదర్శులు సరోజ దేవి, మల్లాది కిషోర్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.


లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన నాయకులు

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్నాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వోల్గా ప్రైడ్ అపార్టుమెంట్స్, భాస్కర ప్యాలస్, శ్రీదేవీ రెసిడెన్సీ, తీక్షా రెసిడెన్సీ, బాబు రెసిడెన్సీ, శ్రీ కృష్ణ నివాస్ అపార్టుమెంట్‌వాసులు సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీన కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మట్లాడుతూ... కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరిస్తామన్నారు. వర్షపునీరు నిల్వకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ పైపులైన్ పరిమాణం పెంచి సమస్యను పరిష్కరిస్తామన్నారు.


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న పలు అపార్టుమెంట్ వాసులు

ఉద్యోగ విరమణ పొంది.. రూ.2కోట్లతో సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు చేసి..

- అందరి మన్ననలు పొందుతున్న డాక్టర్ శశికళ
- ఉద్యోగం చేసిన కళాశాలలోనే అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటు చేసిన వైనం



జేఎన్‌టీయూలో ఆధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌లోని పరికరాలు

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో భాగమైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించి గతేడాది ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ శశికళ యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీ సైన్స్ విభాగంలో రూ.2కోట్లు వెచ్చించి అత్యంత ఆధునిక సౌకర్యాలు, పరికరాలతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లో ఎంఎస్సీ నాల్గో సెమిస్టర్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ల్యాబ్‌ను యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ కట్టా నరసింహారెడ్డి, కంపెనీ సీఈఓ విజయ్‌కార్గ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ అధికారులు, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నియుధా లీ మార్షల్ అకాడమీకి కుమితే కప్ టైటిల్


ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో కప్ సాధించిన రవి, రాకేష్‌తో మాస్టర్స్

మూసాపేట: గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో మొత్తం 4 దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. భరత్‌నగర్‌కాలనీకి చెందిన నియుధా లీ మార్షల్ అకాడమీకి చెందిన రవి, రాకేష్ బ్లాక్ బెల్ట్ విభాగంలో కుమితే కప్ టైటిల్ సాధించి తెలంగాణ పేరును నిలబెట్టారన్నారు. ఇందులో గ్రాండ్‌మాస్టర్స్ సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

మీసేవ ద్వారా ధ్రువపత్రాల జారీ సులభతరం

మీసేవ కమిషనర్ రవికిరణ్




సాక్షి,మేడ్చల్ జిల్లా: మీ–సేవ కేంద్రాల ద్వారా ధ్రువ పత్రాలను సులభతరంగా జారీ చేయడానికి అవసరమైన మార్పులు చేస్తున్నట్లు రాష్ట్ర మీ–సేవ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండల పరిధిలో మీ–సేవ ద్వారా జారీ చేసే వివిధ ధ్రువ పత్రాలు జారీ చేసే ప్రక్రియలో ఏర్పడుతున్న ఇబ్బందులకు సంబంధించిన పలు సమస్యలను మండలాల తహసీల్దార్లు ఈ సందర్భంగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ మీ–సేవ ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలు సులభతరంగా జారీ చేయడానికి మార్పులు,చేర్పులు చేయడం జరుగుతుందని కమిషనర్ రవి కిరణ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వెలుగుతూనే ఉంటాయి.. లేకుంటే అసలే వెలగవు!


పర్వత్‌నగర్ శ్మశానవాటికలో వెలగని వీధి లైటు

మోతీనగర్: నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తరుచూ చెబుతుంటారు. కొంతమంది కిందిస్థాయి విద్యుత్ సిబ్బంది కారణంగా పట్టపగలే కొన్ని రోజుల నుంచి వీధి లైట్లు 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయి. అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లో పలు ప్రాంతాల్లో వీధి లైట్లు పట్టపగలే వెలుగుతూ ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో లైట్లు వెలగక రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఒక పక్క 24 గంటలు వెలుగుతూనే ఉన్న వీధిలైట్లు, మరోపక్క కొన్ని నెలల నుంచి వెలగకుండా వీధి లైట్లు కనిపిస్తున్నాయి.

– హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న పర్వత్‌నగర్‌లో 24 గంటలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, స్థానికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక పోవటంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. అదే విధంగా చీకటి ప్రాంతాల్లో దొంగతనాలు జరిగే ఆస్కారం కూడా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లకు ఆన్‌ఆఫ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. శ్మశానవాటిక, పలు ప్రాంతాల్లో వెలగని వీధి లైట్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహిద్ షరీఫ్ బాబా తెలిపారు.


పర్వత్‌నగర్‌లో వెలుగుతున్న వీధి లైట్లు

మర్యాదపూర్వక కలయిక

ఆల్విన్‌కాలనీ: పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ని సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు సమ్మారెడ్డి, నాగేష్‌గౌడ్, షౌకత్‌అలీ మున్నా, డి. గోపాల్, లింగంరావు, భీమ్‌రావు, వై. శ్రీనివాస్, డి.సుధాకర్, రాజ్యలక్ష్మి, అరుణ, సౌందర్య, స్వరూప, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు

27 తేదీలోగా అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తులు చేసుకోవాలి

కీసర: కీసరగుట్టలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ మధునాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందన్నారు. విద్యార్హతలు అనుభవం కలిగిన వారు ధృవీకరణ పత్రాలతో ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఆంగ్లం, గణితం, సామాన్య, భౌతిక, వృక్ష, జంతు, సాంఘిక శాస్త్రంలో పీజీ, బీఈడీ తత్సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9866559681 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఐటీఐ కోర్సుల్లో దరఖాస్తులు షురూ

మేడ్చల్: మేడ్చల్‌లోని పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలలో పలు కోర్సులలో చేరేందుకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ సోమవారం ఒక ప్రటకన ద్వారా తెలిపారు. కళాశాలలో ఏడాది, రెండేళ్ల కోర్సులకు చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు సమయంలో విద్యార్థులు కళాశాల ఎంపిక, చదివే కోర్సు, విద్యార్థి వివరాలు, మొబైల్ నెంబర్ సరిగ్గా ఉండేలా చూసుకుని దరఖాస్తు చేయాలని సూచించారు.

ఇగ్నోలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024వ సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ బి.రాజగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేషన్) కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బీఏ, బీకాం, బీఎస్సీలో చేరేందుకు పూర్తి ఫీజు రాయితీని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్: www.ifnou.ac.in లేదా 9492451812, 040-23117550 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు రవీంద్రభారతిలో సీల్‌వెల్ సుస్వరాలు

గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతిలో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీల ఆధ్వర్యంలో ఈ నెల 21 (నేడు)సీల్‌వెల్ సినీ సుస్వరాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ గాయనీ ఆమని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటుడు మురళీ మోహన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, కోలేటి దామోదర్ గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పలువురికి ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, దాసరి పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

నేటితో ముగియనున్న ఓయూ వీసీ పదవీ కాలం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్ పదవీ కాలం (21న) నేటితో ముగియనుంది. మూడేళ్ల క్రితం వీసీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన క్యాంపస్‌లోని వైస్ ఛాన్సలర్ నివాసంలో ఉంటూ 21 పాయింట్ ఫార్ములతో నిత్యం వర్సిటీ అభివృద్ధికి పాటు పడ్డారు. కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగుల బదిలీ విషయంతో కొంత వివాదం తలెత్తినా వారి సేవలు మెరుగు పడ్డాయి. సకాలంలో వేతనాలు అందిస్తూ ఉద్యోగుల మన్ననలను పొందారు. పీహెచ్‌డీ విద్యార్థులకు వన్‌టైమ్ ఛాన్స్ ఇచ్చి వందలాది మంది పూర్వ విద్యార్థులకు డాక్టరేట్ డిగ్రీలను అందుకునేలా అవకాశం కల్పించారు. హాస్టల్ సమస్యలు లేకుండా చేసి విద్యార్థినులకు క్యాంపస్‌లో ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు.100 ఏళ్ల పైలాన్ నిర్మాణం, కొత్త హాస్టల్స్, ఇతర భవనాలను నిర్మించారు. కొన్ని కఠిన నిర్ణయాలతో వివాదాలు చెలరేగినప్పటికి ఉద్యోగ నియామకాలు మినహా ఓయూ అభివృద్ధికి ఇతర వీసీల కన్నా వినూత్నంగా సేవలందించి వీసీగా ప్రొ.రవిందర్ మంచి పేరు తెచ్చుకున్నారు.

దేవాదాయ ధర్మాదాయ ఉద్యోగులకు ఐఆర్ కల్పించాలి

సుల్తాన్‌బజార్: దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగులకు గత ప్రభుత్వం ప్రకటించిన ఐఆర్. (ఇంటర్ రిలీఫ్)ను కలపాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ అర్చక ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎండోమెంట్స్ అండ్ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ అయ్యర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు గంధం కర్ణాకర్ నాయుడు, సీహెచ్ బద్రినాథ చార్యులు, కాండూరి కృష్ణమాచార్యులు, పరశురాం రవీంద్రచార్యులు, చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ.. అర్చక ఉద్యోగ కుటుంబాలకు కారుణ్య నియామకం ద్వారా ప్రస్తుతం ఆలయాల ద్వారా జీతాలు అందజేస్తున్నారని, వారికి గ్రాంటీన్ ఏయిడ్ ద్వారా జీతాలు రావాల్సి ఉందన్నారు. ఆ ఫైల్‌కు ఫైనాన్స్ శాఖ క్లియరెన్స్ ఇచ్చినా ఎండోమెంట్స్‌లో మాత్రం పెండింగ్‌లో ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో తమకు జీతాలు ఇచ్చిన ప్రభుత్వానికి ఎలాంటి భారం పడదన్నారు. అలాగే కొంతకాలంగా సర్వీస్ ఇంక్రిమెంట్లు, సాంకేతిక పరమైన అంశాలు నిలిపేశారని పేర్కొన్నారు. దానికి ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ఘనంగా తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం

పలువురికి కార్టూన్ మిత్ర పురస్కారాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హాస్యానందం, సత్కాలభారతీ ఆధ్వర్యంలో రవీంద్రభారతీలో సోమవారం తెలుగు కార్టూనిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ...హాస్యం మన ఆయుషున్ని పెంచుతుందన్నారు. 'నవ్వడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగం' అని పెద్దలు ఊరికే అనలేదని గుర్తుచేశారు. అనంతరం ప్రముఖ కార్టూనిస్టు కృష్ణ కిశోర్ కార్టూన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా హాస్యానందం నిర్వహించిన కార్టూన్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు పలువురికి కార్టూన్ మిత్ర పురస్కారాలు అందజేశారు. సినీ నటుడు హర్షవర్ధన్,సాహిత్యకారులు సుధామ, సాంఘిక సేవకురాలు సత్యవాణి, బాపూరమణ అకాడమీ కార్యదర్శి సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రజల్లో సామాజిక చైతన్యం రావాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

గన్‌ఫౌండ్రీ: ప్రజల్లో సామాజిక చైతన్య విప్లవం రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రవీంద్రభారతీలో మంజునాథ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి గ్లోబల్ ఐకాన్ అవార్డులను సోమవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సినీ నటులు పృథ్వీ, కిరణ్, క్రిష్, జగదీశ్వరీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ మామిడి భీం రెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మంజుల గౌడ్ పాల్గొన్నారు.